క్లుప్తంగా

వీరాంజనేయస్వామి ఆలయానికి విరాళం



చిలకలూరిపేట: మండలంలోని మురికిపూడి గ్రామంలో వేంచేసిఉన్న బోటు వీరాంజనేయ స్వామి దేవాలయానికి ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు రూ. లక్ష విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కాపు కేశవరావు, ఉపాధ్యక్షుడు కొమ్మనబోయిన రామారావు గురువారం మల్లెల రాజేష్‌నాయుడును కలసి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. స్పందించిన ఆయన ఆలయ ముఖద్వారం వద్ద సాలహారం నిర్మాణానికి విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వెంకట సుబ్బారావు, సీహెచ్ సీతారామయ్య, పి.శివరావు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

శావల్యాపురం: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైకు అపహరణకు గురైన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఆర్యవైశ్య వీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉండే చిలకబత్తిని సురేంద్ర తన బైకును పార్కింగ్ చేశాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేసిన బైకు హ్యాండిల్ తాళం పగలగొట్టి అపహరించారు. చోరీ జరిగిన విషయాన్ని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బయోమెట్రిక్‌కు సహకరించాలి

శావల్యాపురం: వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత రుణ మాఫీలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 706 స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు రూ.5 కోట్లు 58 లక్షలు లబ్ధి పొందినట్లు ఇన్‌చార్జ్ ఏపీయం ఖాజావలి తెలిపారు. గురువారం స్థానిక స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాప్‌లో అర్హత ప్రతి మహిళా సభ్యురాలు ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్ నమోదు చేసిన తదుపరి గ్రూపు సభ్యుల తీర్మానం చేసిన ధ్రువీకరణ పత్రాలు సంబంధిత బ్యాంకులో అందజేస్తే సత్వరమే మహిళా సభ్యురాలకు చెందిన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారన్నారు. ప్రతి సభ్యురాలు ఆయా గ్రామాల్లోని వీవోఏలకు బయోమెట్రిక్ ప్రక్రియకు సహకరించాలని మూడు రోజుల వ్యవధిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆయనతో పాటు సీసీలు గొట్టం రమాదేవి, బేబిరాణి, యానిమేటర్లు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించాలి

శావల్యాపురం: పర్యావరణహిత జీవనశైలి విధానంపై ప్రతి ఒక్కరు బాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శక్తి వనరులను పొదుపుగా వినియోగించాలని, నీటిని పొదుపుగా వాడాలని, ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ నలబోతుల వరలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీయం ఖాజావలీ, సీసీలు రమాదేవి, బేబీరాణి, అన్నీ గ్రామాల్లోని వీవోఏలు పాల్గొన్నారు.

అనుమతి ఉన్న విత్తనాలే విక్రయించాలి

యడ్లపాడు: రైతులకు అమ్ముతున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను డీలర్లు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏవో సీహెచ్ సరిత చెప్పారు. వారం ఆమె మాట్లాడుతూ రైతులు లైసెన్స్ లేని షాపుల్లోనూ అలాగే వివిధ వాహనాలపై వచ్చి లూజుగా విత్తనాలను విక్రయించే వారివద్ద కొనుగోలు చేయరాదన్నారు. మండలం పరిధిలో యడ్లపాడు, బోయపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట, లింగారావుపాలెం గ్రామాల్లో లైసెన్స్ పొందిన విత్తన విక్రయ షాపులు ఐదు షాపులు మాత్రమే ఉన్నాయన్నారు. ఏషాపుల్లోనైనా నిషేధిత విత్తనాలు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరలు, నిల్వల బోర్డులు ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసేవాటికి తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని, రైతులు అడిగి తీసుకోవాలన్నారు. ఆయా రసీదులను జాగ్రత్త చేసుకోవాలన్నారు. నాణ్యత పరీక్షల నిమిత్తం విత్తనాల దుకాణాల నుంచి సేకరించిన విత్తన నమూనాలను కోడింగ్ చేసి అందులో వచ్చిన ప్రకారంగా తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లోని ల్యాబ్‌లకు పంపుతున్నట్లు ఏవో తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాదెండ్ల మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన మార్శెట్ల పద్మ (50) నిత్యావసర సరకుల కొరకు పట్టణానికి వచ్చి తిరుగు ప్రయాణంలో మండలంలోని లింగంగుంట్ల గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా నరసరరావుపేట నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. గాయపడిన పద్మను 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రాడ్యుయేషన్ డే



ఈపూరు ప్రాజెక్టు పరిధిలోని గుమ్మనంపాడు సెక్టార్‌లోని మేళ్ళవాగు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా హబ్ కో ఆర్డినేటర్ మహేష్ హాజరై పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మనంపాడు సెక్టార్ సూపర్ వైజర్ ఎస్‌కె మస్తాన్‌బీ, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పెద్దలు, తల్లులు పాల్గొన్నారు.

–బొల్లాపల్లి

లింకు రోడ్లకు మహర్దశ



వేల్పూరులో పొలాలకు వెళ్లే లింకు రహదారుల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఈ పనులు చేపట్టామన్నారు. గ్రామంలో రైతుల సహకారంతో తొలిదశలో పొలాలకు వెళ్లే ఇరువైపులా ముళ్లకంచెలు పొక్లయినర్ ద్వారా తొలగించి గుంతలు పూడ్చి గ్రావెల్ మట్టి పోసి చదును చేసే పనులు జరుగుతున్నాయన్నారు.

–శావల్యాపురం

పాలనకు మెచ్చి..



ఈపూరు మండలం అగ్నిగుండాల గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన 11 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈసందర్భంగా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటామన్నారు.

– నూజెండ్ల

ఆలయానికి విరాళం



గణపవరంలో ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న రామాలయాన్ని ఎంఆర్ ఫౌండేషన్ అధినేత, ఏపీఐసీసీ డైరెక్టర్ మల్లెల రాజేష్ నాయుడు గురువారం సందర్శించారు. రూ.2.5 కోట్లతో నిర్మించిన జరిగిన ఆలయ నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం యాగశాలను సందర్శించి ఆలయానికి ఎంఆర్ ఫౌండేషన్ తరపున రూ.5 లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందించారు.

–నాదెండ్ల

పారదర్శకంగా సంక్షేమ ఫలాలు

- నాడు–నేడు వంటి పథకాలతో అభివృద్ధికి బాటలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పారదర్శకంగా గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగనన్నకే దక్కుతుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల పరిధిలోని కట్టుబడివారిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీ ఆలా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాల రామారావు, కర్నాటి ఆంజనేయులు, ముత్యాల నాగేశ్వరరావు, మాదం వెంకటేశ్వర్లు, బొమ్మసాని పిచ్చిబాబు, అమ్మనబ్రోలు కోటేశ్వరరావు, కుంబా వెంకటేశ్వర్లు, ఉయ్యాల కోటేశ్వరరావు, చెందుకూరి జయకృష్ణ పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

ముఖ్యమంత్రి సహాయనిధి రూ.2 లక్షలు మంత్రి రజిని అందజేత



తాడికొండ సుధకు సీఎం రిలీఫ్‌ఫండు రూ.2 లక్షలు అందిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: ప్రతిఒక్కరి ఆరోగ్య సంరక్షణే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని మైదవోలు గ్రామానికి చెందిన తాడికొండ బాబు కొద్దికాలం కిందట అనారోగ్యంతో గుంటూరు కార్పొరేట్ ఆస్పత్రిలో సర్జరీ చేయించుకున్నారు. యడ్లపాడు గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరైన మంత్రి రజిని సదరు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2 లక్షల చెక్కును బాబు భార్య సుధకు అందజేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్ చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ కె.హేమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, పార్టీ జిల్లా కార్యదర్శి రాచమంటి చింతారావు, మైదవోలు మాజీ సర్పంచ్ గోరు హనుమంతరావు, పార్టీ నాయకులు గోరు రాజేష్, ధర్నాసి రవికుమార్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ. 18 కోట్లు



నూజెండ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో భాగంగా నియోజకవర్గంలోని గుండ్లకమ్మ నదిపై రెండు వంతెనలు, ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం నూజెండ్ల మండలం నాగిరెడ్డిపల్లి వద్ద గుండ్లకమ్మ నదిపై త్వరలో నిర్మాణం చేపట్టనున్న వంతెన పనులను ఆయన పరిశీలించారు. రూ. 18 కోట్ల నిధులతో వినుకొండ, నూజెండ్ల మండలాలు కలుపుతూ గుంటూరు – కర్నూలు జాతీయ రహదారికి అనుసంధానంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. అలాగే నూజెండ్ల మండలం పువ్వాడ, గోకనకొండ మధ్యలో మరో వంతెనకు రూ. 17 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

ఈదురుగాలులకు దెబ్బతిన్న గృహాలు



వడ్డెంగుంటలో ఈదురు గాలులకు దెబ్బతిన్న రేకుల ఇళ్లు




శావల్యాపురంలో పడిపోయిన విద్యుత్ స్తంభానికి మరమ్మతు చేస్తున్న సిబ్బంది

బొల్లాపల్లి: ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో రేకులు, ఇల్లు దెబ్బతిన్నాయి. బుధవారం రాత్రి ఈదురు గాలితో వర్షం కురవడంతో గ్రామానికి చెందిన యాలగాల వెంకటేశ్వర్లుకు చెందిన కోళ్ళఫారంతో పాటు ఎం.వెంకటేశ్వర్లు రేకుల ఇల్లు పూర్తిగా దెబ్బతింది. వీరితో పాటు మరో ఐదుగురు రేకుల షెడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీరిలో వీకే మంగమ్మ, పి. కోటేశ్వరమ్మ, వి. అంకారావు తదితరులకు చెందిన రేకుల ఇల్లు పాక్షికంగా దెబ్బతిని నష్టపోయారు. ఈదురు గాలులకు మండలంలని రేమిడిచర్ల, బొల్లాపల్లి సెక్షన్ల పరిధిలో ట్రాన్స్‌కోకు కరెంటు స్తంభాలు విరిగి నేలకొరగడంతో నష్టం వాటిల్లిందని ఆశాఖ అధికారులు గురువారం తెలిపారు. బొల్లాపల్లి సెక్షన్ పరిధిలోని వడ్డెంగుంట, మూగచింతలపాలెం, బొల్లాపల్లి, సరికొండపాలెం తదితర గ్రామా ల్లో సుమారు 35 స్తంభాలు, రేమిడిచర్ల సెక్షన్ పరిధిలో మన్నేపల్లితండా, బోడిపాలెం తండా, రావులాపురం, రేమిడిచర్ల తదితర గ్రామాల్లో సుమారు 45 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, సంఘటన ప్రదేశాలను వినుకొండ ఏడీఈ కిరణ్ బాబు సందర్శించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: ఈదురు గాలుల ధాటికి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం వాటిల్లిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని వేల్పూరు, పోట్లూరు, కృష్ణాపురం, కారుమంచి తదితర గ్రామాల్లో గాలులు ప్రభావంతో 11 కె.వి.విద్యుత్ స్తంభాలు 20 పడిపోయినట్లు మండల విద్యుత్ అధికారి సంపెంగుల గాంధీ తెలిపారు. విద్యుత్ అధికారుల ఆదేశాలు మేరకు మండల విద్యుత్ అధికారులు లైన్‌మెన్స్ యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేపట్టారు.

7న గణపవరంలో ప్రతిష్టా మహోత్సవం



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న శ్రీకూర్మనాథస్వామి, కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరంలో రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన శ్రీ రామాలయాన్ని త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి శిష్యుడైన శ్రీ కూర్మనాథస్వామి సందర్శించారు. జూన్ 7వ తేదీన ఉదయం 7.43 గంటలకు విగ్రహ, జీవ ధ్వజస్తంభం, కలశ ప్రతిష్టా మహోత్సవం జరగనున్న నేపథ్యంలో గురువారం ఆహ్వాన పత్రికలను కమిటీ సభ్యులతో కలిసి శ్రీ సోమేశ్వర వీరభద్రస్వామి దేవస్థానం, కెల్లంపల్లి వీరయ్య ధర్మ సత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాముడు లేని గ్రామం కనిపించదన్నారు. జూన్ 3 నుంచి 6వ తేదీ వరకూ తిరుమల తిరుపతి దేవస్థానం వేద పాఠశాల అధ్యాపకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు క్రతువు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా త్రిదండి చినశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి హాజరుకానున్నారు. అదేరోజు ఉదయం 11 గంటల నుంచిడి 50 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆయనతో పాటూ చినజీయర్ స్వామి సీతానగరం ఆశ్రమ మేనేజర్ గుదిమెళ్ళ రఘునాథ్ స్వామి, కేతినేని శ్రీహరిరావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



మీరావలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

నూజెండ్ల: మండల పరిధిలోని చింతలచెరువు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందిన చింతలచెరువు మీరావలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గురువారం పరామర్శించారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

నూజెండ్ల: మండల పరిధిలోని మూర్తిండియాపురం గ్రామ పంచాయతీలో చెన్నారెడ్డి కాలనీలో సీతారామ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నాదెండ్ల: గణపవరం 1–2 సచివాలయాలను డీఎల్‌డీవో వెంకటరెడ్డి తనిఖీ చేశారు. రెండు సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సర్వీస్ చార్జీల వసూలు, బ్యాంకులకు జమ చేస్తున్న రికార్డులు పరిశీలించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయి, పెండింగ్‌లో ఉన్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు శేఖర్, కోటేశ్వరరావులు మాట్లాడుతూ గణపవరం మేజర్ పంచాయతీ అని, విద్యార్థులు, గ్రామ జనాభా అధికంగా ఉన్నందున తప్పనిసరిగా ఆధార్ సెంటర్ కావాలని కోరారు. దీనిపై ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి వచ్చే సోమవారం నాటికి ఆధార్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.

చందవరంలో ఆలయాల వార్షికోత్సవం

నాదెండ్ల: చందవరం గ్రామంలో పలు ఆలయాల తొలి వార్షికోత్సవ వేడుకలు గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గతేడాది మే నెలలో బొడ్డురాయి (సీతాలాంబతల్లి) ఆంజనేయస్వామి, శివాలయం, బ్రహ్మం గారి ఆలయం, విఘ్నేశ్వరస్వామి ఆలయం, అభయాంజనేయ స్వామి ఆలయం, అంకమ్మ తల్లి ఆలయాలు నిర్మించిన విషయం విదితమే. ఉదయాన్నే భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. చిలకలూరిపేట జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



విత్తనాలు, పురుగుమందుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఏవో టి శ్రీలత

చిలకలూరిపేట: విత్తనాలను అధికధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత హెచ్చరించారు. పట్టణంలోని విత్తనాలు, పురుగుమందుల దుకాణాలతో పాటు, ట్రాన్స్‌పోర్టు ఆఫీసులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతులు లేని విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను సక్రమ రీతిలో నిర్వహించాలన్నారు. రైతులు కోరిన విత్తనాలను మాత్రమే నిర్ణయించిన ధరలకు అమ్మాలని, అలా కాకుండా వారిని మభ్యపెట్టి వేరే రకం విత్తనాలను అంటగట్ట రాదని పేర్కొన్నారు. రైతులకు పూర్తి వివరాలతో కూడిన కొనుగోలు రసీదులు ఇవ్వాలని సూచించారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే సెల్ నంబర్ 8331056944కు ఫిర్యాదు చేయాలన్నారు. ట్రాన్స్ పోర్టు సంస్థల వారు బిల్లులు లేకుండా విత్తనాలు, పురుగు మందులు వచ్చిన వెంటనే వ్యవసాయాధికారి కార్యాలయంలో సమాచారం అందజేయాలని చెప్పారు. నకిలీ విత్తనాల రవాణాకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చక్కని చేతిరాత.. మార్చేను నుదుటి రాత

- పీఆర్ విజ్ఞానకేంద్రం సభ్యులు నూతలపాటి కాళిదాను
- వేసవి శిక్షణ శిబిరంలో క్యాలీగ్రఫీపై తర్ఫీదు
- ఉచిత సేవలు అందించిన మాస్టారుకు సత్కారం



ఉచిత శిక్షణ ఇచ్చిన జున్ను మాస్టర్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

యడ్లపాడు: మంచి చేతిరాత విద్యార్థుల విధిరాతనే మార్చేస్తుందని పీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు నూతలపాటి కాళిదాసు తెలిపారు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ విద్యా విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం కొనసాగుతున్న విషయం తెలిసిందే. శిక్షణలో భాగంగా విద్యార్థులకు చక్కని చేతిరాతపై శిక్షణను అందించారు. మూడు రోజుల పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, వండర్‌బుక్ ఆఫ్ వరల్డ్ గ్రహీత షేక్ జున్ను హాజరై పిల్లలకు క్యాలీగ్రఫీలో శిక్షణ అందించారు. క్యాలీగ్రఫీలో పిల్లలకు ఉచిత తర్ఫీదు నిచ్చిన జున్ను మాస్టారుని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు కల్లూరి వాసు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో 110 మంది ఉచితంగా చేతిరాతను నేర్పించామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయాల్లో అందమైన చేతిరాత ఎంతగానో దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన వారికి చేతిరాతపై పరీక్ష నిర్వహించి విజేతలైన అమృత వర్షిణి, కార్తిక, ధర్మతేజ, పూజ స్వాతీలకు అతిథులు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేతా రామబ్రహ్మం, ఉపాధ్యాయులు షేక్ మీరావలి, విజయ్, నాగరాజు, రమాదేవి ఉన్నారు.

వార్డు వలంటీర్లకు ఘన సన్మానం



సన్మానం పొందిన వలంటీర్లతో వార్డు ఇన్‌చార్జి, కన్వీనర్, సచివాలయ ఉద్యోగులు

నరసరావుపేట: స్థానిక 14వ వార్డు కంభంపాలెం సచివాలయంలో గురువారం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డులు అందుకున్న వారిని శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అత్యుత్తమ సేవను కనబరిచిన వలంటీర్ షేక్ మొహమ్మద్ హనీఫ్‌కు సేవావజ్ర అవార్డు, రూ.30 వేలు రివార్డు, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. అదే విధంగా మిగిలిన వలంటీర్స్ అందరినీ సేవారత్న అవార్డుతో రూ.10 వేలు, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కారం చేశారు. వార్డు కన్వీనర్, ఇన్‌చార్జి బండి వెంకటేశ్వరరెడ్డి, వార్డు కన్వీనర్ పాతర్ల చిన్ని, మాజీ కౌన్సిలర్ సల్లగుండ్ల సతీష్, సచివాలయ అడ్మిన్ సెక్రటరీ షేక్ కరీముల్లా, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొని అభినందలు తెలిపారు.